క్లుప్తంగా

ఉత్తమ హెచ్‌ఎం కోటయ్య



కారెంపూడి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కాకానివారి పాలేనికి చెందిన మద్దినేని వెంకట కోటయ్య ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం అవార్డును ప్రదానం చేశారు. ప్రస్తుతం మండలంలోని పెద కొదమగుండ్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. హెచ్‌ఎంగా పాఠశాల, విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



మాచర్ల: భారీ వర్షాల కారణంగా పట్టణంలో పలు చోట్ల పేరుపోయిన చెత్తా చెదారం తొలగింపునకు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ పి.నాగేశ్వరరావు గురువారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పురపాలక సంఘ సిబ్బంది బృందాలుగా ఏర్పడి రైల్వే స్టేషన్ రోడ్డు, బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్, రింగు రోడ్డు సెంటర్, మార్కెట్, కొమ్మర్ల కాలువ ప్రాంతాలను శుభ్రపరిచారు. కాల్వల పూడిక తీశారు.

వరద బాధితులకు బిస్కెట్లు



దుర్గి: విజయవాడలో వరద బాధితులకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి బిస్కెట్లను పంపారు. గురువారం ఎంపీపీ యేచూరి సాయిశంకర్ నేతృత్వంలో బిస్కెట్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా, ఏఓ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రాజు తదితరులున్నారు.

దుర్గిలో వైద్య శిబిరం

దుర్గి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పోలేరమ్మ గుడి వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ మురుగు నీరు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ సిబ్బంది విజయలక్ష్మి, నాగలక్ష్మి పలువురికి మందుల కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కటకం భావన్నారాయణ, కాట్రాజు నరసింహారావు, తుపాకుల కోటి, మోక్ష, ఎస్.మరియదాసు పాల్గొన్నారు.

రొంపిచర్లలో తేలికపాటి వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం తేలికపాటి వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఉదయానికి 1.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తున్నాయి. అలాగే నరసరావుపేట డివిజన్‌లో 33.6 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా సగటున 3.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. చిలకలూరిపేటలో 2.2 ఎం.ఎం., యడ్లపాడులో 11.2, ఈపూరు 2.8, నాదెండ్ల 2.4, నరసరావుపేట 1.4, నూజెండ్ల 2.2, శావల్యాపురం 4.2, వినుకొండ 3.8, బొల్లాపల్లి 2.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది.

పోషకాహారంపై అవగాహన సదస్సు

శావల్యాపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత అన్నారు. గురువారం మండలంలోని వేల్పూరు గ్రామంలో అంగన్‌వాడీ సెంటరు నందు పోషకాహారం మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి దూరంగా ఉండవచ్చన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మాచర్ల: ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పలు విద్యాలయాల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిని సత్కరించారు. పట్టణంలోని ఏపీ యూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు కె.రామ్మూర్తి ఆధ్వర్యంలో అధ్యాపకుడు గాజుల ముక్కంటిని పలువురు జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్ సకీనా, నాగరాజు పాల్గొనగా ఉపాధ్యాయులను సత్కరించారు. పట్టణంలో వాసవీ క్లబ్ మాచర్ల అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, ఆపోపా అధ్యక్షుడు జేవీకేఎస్ ప్రసాద్, జిల్లా ప్రోగ్రాం అధికారి తిరివీధి వెంకట నాగేశ్వరరావు, చుండూరు సత్యనారాయణ, పందిరి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదిత్య ఒకేషనల్ కళాశాలలో పలువురు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అలాగే మాచర్ల పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల్లో గురుపూజోత్సవం నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

దాచేపల్లి : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చింతకింది వెంకట కోటేశ్వరరావు, బోల్లంపల్లి ఏసురత్నంను గురువారం ఘనంగా సన్మానించారు. మాదినపాడు ప్రాథమిక పాఠశాలలో కోటేశ్వరరావు, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏసురత్నం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఎస్టీయూ నాయకులు రామిరెడ్డి, చెట్టిపాగు ఏసురత్నం, యూటీఎఫ్ నేతలు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి వారికి సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా వేణుగోపాల్

కారెంపూడి: స్థానిక ఏపీ టీడబ్ల్యూఆర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గురు పూజోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు. కారెంపూడి ఎస్టీ బాలుర గురుకులం విద్యార్థులు వరుసగా పదవ తరగతిలో అత్యధిక ఉత్తీర్ణత, మార్కులు సాధిస్తున్న నేపథ్యంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌కు ఈ గౌరవం దక్కింది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరణ

మాచర్ల రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం జరిగిన గురు పూజోత్సవంలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి.కర్తయ్య, ద్వారకాపురి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.ఆదినారాయణ, వీరభద్రాపురం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ కొర్లయ్య అవార్డు అందుకున్నట్లు విద్యా శాఖాధికారులు తెలిపారు. వీరిని ఎంఈఓ అల్లి సురేష్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నలుగురు ఉపాధ్యాయులకు అవార్డు

మాచవరం: మాచవరం మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మోర్జంపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.పద్మాబాయి, శ్రీ రుక్మిణీపురం ఎంపీయూపీఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎస్. సునీత, పిల్లుట్ల ఎంపీయూపీఎస్ హెచ్‌ఎం వీఎంఆర్ గోపాలమూర్తి, కొత్త గణేశునిపాడు ఎంపీయూపీఎస్ హెచ్‌ఎం ఎం.శ్రీధర్ గురువారం ఉపాధ్యాయ దినోత్సవాల్లో కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మాచవరం: మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయలను సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

దాచేపల్లి: గురువులను గౌరవించాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురు పూజోత్సవం గురువారం నిర్వహించారు. ముత్యాలంపాడు జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఆరిజన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాట్రపాడు ప్రభుత్వ పాఠశాలలో మనబడి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ కందుల జాను, నగర పంచాయతీ చైర్ పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ పాల్గొన్నారు.


అధ్యాపకుడు ముక్కంటికి సన్మానం


కృష్ణవేణి ప్రిన్సిపల్ వెంకట్రామయ్యకు సత్కారం


వాణి విద్యానికేతన్‌లో రాధా కృష్ణన్ చిత్రపటానికి నివాళి


నెహ్రూ నగర్ ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయులకు సత్కారం


కోటేశ్వరరావు, ఏసురత్నంకు సన్మానం


అవార్డు స్వీకరించిన వేణుగోపాల్


అవార్డు అందుకుంటున్న ఎన్.ఆదినారాయణ


జి.కర్తయ్యకు అవార్డు ప్రదానం


అవార్డు అందుకున్న సీహెచ్ కొర్లయ్య


మాచవరం జెడ్పీ హై స్కూల్లో ఉపాధ్యాయలకు సన్మానం


ముత్యాలంపాడు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

చినుకుపడితే.. చెరువే


చిన్నపాటి వర్షానికి జలమయం అయిన కారంపూడి రోడ్డు (ఫైల్)

గురజాల: పేరుకు మాత్రం నగర పంచాయతీ కానీ, వసతులు శూన్యం. పాలకులు కల్లబొల్లి మాటలు చెప్పి కాలం వెల్లదీస్తున్నారే కానీ, డ్రెయినేజ్‌కు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయంగా మారి, చెరువులను తలపిస్తున్నాయి. మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోతున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలకు చెరువులుగా మారిన కారంపూడి రోడ్డు, మాచర్ల రోడ్డు, గుంటూరు రోడ్డు ఇందుకు నిదర్శనం.

డ్రెయినేజీలు దెబ్బతినడంతో పాటు..వర్షపు నీరు మురుగు నీటితో కలిసి రోడ్లపైకి చేరింది. ఆ దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కారంపూడి రోడ్డులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురు, లక్ష్మీ టాకీస్ సెంటర్, కట్టెల అడితి సెంటర్‌లో చిన్న పాటి వర్షానికి రోడ్డు పైకి నీరు చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పూడిక తీత పనులు చేపట్ట లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..!

మాచర్ల పట్టణంలో డ్రెయినేజీలు గతంలో ఎప్పుడో కట్టినవి కావడంతో గత ప్రభుత్వ హయాంలో పలు కాలనీల్లో కాల్వల నిర్మాణాలు చేపట్టారు. దీంతో అక్కడ మురుగు సాఫీగా సాగిపోతోంది. మిగిలిన వార్డుల్లో ఎక్కడ చూసినా డ్రెయినేజీ సమస్య కనిపిస్తోంది. ఇప్పటి కైనా అధికారులు, పాలకులు స్పందించి డ్రెయినేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి

జిల్లా వైద్యాధికారి బి.రవి

పిడుగురాళ్ల: పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అంటువ్యాధులు సోకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. గురువారం పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎల్‌బీసీ కృష్ణారావు బజారులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. కొంత మంది వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించటంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎక్కువ మందికి ఆరోగ్య సమస్యలు ఉన్న చోట ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట డీపీవో వన్నూరు బాషా, వైద్యులు అమరేశ్వర రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి బి. రవి

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చవితి వేడుకలు

నాదెండ్ల: ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని యడ్లపాడు ఎస్సై, నాదెండ్ల ఎస్ వి బాలకృష్ణ, జి.పుల్లారావులు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు చేసే ప్రతి చోటా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మందితో కమిటీ ఏర్పాటు చేసుకుని అనుమతి తీసుకోవాలన్నారు. స్థల యజమాని అనుమతితో పాటూ నిమజ్జనం తేది, ప్రదేశం, ఊరేగింపుకు వినియోగించే వాహనం వివరాలు తదితరాలను పోలీసులకు అందించాలన్నారు. రాత్రి 6 గంటల నుండి 10 గంటలలోపే వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. మండపాల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. డీజేలు, నృత్య ప్రదర్శనలకు అనుమతులు లేవని ఇరువురూ వెల్లడించారు.

మొక్కలు పెంపకంపై సదస్సు

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామసచివాలయ పరిధిలోని రైతులకు అటవీ యేతర ప్రాంతంలో చెట్లు పెంపకం కార్యక్రమంపై రైతులకు శిక్షణా సదస్సు గురువారం నిర్వహించారు.

అనుమతులు తప్పనిసరి


ఉత్సవ కమిటీలతో మాట్లాడుతున్న సీఐ వెంకట్రావ్

మాచర్ల: వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసే పందిళ్లకు విద్యుత్ సరఫరా నిమిత్తం తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు గురువారం తెలిపారు. వార్డు సచివాలయం లేదా ఏపీ సీపీడీసీఎల్ వెబ్‌సైట్, మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

దాచేపల్లి: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని సీఐ గుత్తి వెంకట్రావ్ తెలిపారు. ఉత్సవ కమిటీలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండపాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చాలన్నారు. ఊరేగింపులో డీజేకి అనుమతులు లేవని స్పష్టం చేశారు. నిమజ్జన సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాలన్నారు. ఎస్ఐ దాసరి శివ నాగరాజు పాల్గొన్నారు.

వడ్డెర విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా రేవతి నియామకం



దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వడ్డెర విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన దేవళ్ల రేవతి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసిన జాబితాలో రేవతిని వడ్డెర విభాగం అధ్యక్షురాలిగా నియమించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రేవతి పనిచేశారు. జిల్లా పరిషత్ వైఎస్సార్‌సీపీ ప్రతిపక్ష నాయకురాలిగా, బెల్లంకొండ జెడ్పీటీసీగా రేవతి పనిచేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రెండోసారి సీఎంగా చేసేందుకు కష్టపడి పని చేస్తానని, వడ్డెర్ల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని రేవతి తెలిపారు. రేవతి నియామకం పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలే టార్గెట్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఇర్లా శివపై పోలీసులు టార్గెట్ పెట్టారని శివ తండ్రి గురుస్వామి గురువారం ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి తన కుమారుడు పిడుగురాళ్ల పట్టణంలో ఉండకుండా వేరే ఊరిలో ఉంటున్నాడని, అయినా టీడీపీ నాయకులు శివను టార్గెట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే పట్టణ పోలీసులు బుధవారం అర్ధరాత్రి తనను, తన చిన్న కుమారుడు శ్రీనివాసరావును తీసుకొని వెళ్లారు. తన పెద్ద కుమారుడు శివను కూడా పోలీస్ స్టేషన్‌లో అప్పగించే వరకు తనను తన చిన్న కుమారుడిని వదిలిపెట్టేది లేదని పోలీస్‌స్టేషన్‌లో కూర్చొబెట్టారని, గురువారం తనను ఇంటికి పంపించారని, తన చిన్న కుమారుడు శ్రీనివాసరావును పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని, అలాగే పెద్ద కుమారుడు శివ పోలీస్ స్టేషన్‌కు వస్తేనే వదిలేస్తామని తెలుపుతున్నారని తెలిపారు. ఈ విషయమై పట్టణ సీఐ ఎస్.వెంకట్రావును వివరణ కోరగా తండ్రి గురుస్వామి ఇంటి సమీపంలో నివసిస్తున్న బత్తుల వెంకటాద్రి కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. ఈ నగదును ఐదేళ్లుగా ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ రావటంతో వెంకటాద్రి కోడలు బత్తుల సుజాత ఫిర్యాదు చేయటంతో పోలీస్ స్టేషన్‌కు వారిని తీసుకొని వచ్చినట్లు సీఐ తెలిపారు. వారు అగ్రిమెంట్ల మీద గురుస్వామి, అతని కుమారుడు ఇర్లా శ్రీనివాసరావు, శివల సంతకాలు ఉండటంతో వారిని కూడా పిలిపించి సమస్యను పరిష్కరించుకోమని తెలిపాం. సుజాత ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

తక్షణం నిత్యావసరాలు అందించాలి

గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: వరద బాధితులకు నిత్యావసర సరుకులను తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో నియోజకవర్గ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రెయినేజ్ నీరు తాగు నీటితో కలిస్తే ప్రజలు అంటు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే పైపు లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాలకు, వరదలకు తెగిపోయిన విద్యుత్ వైర్లు, పడిపోయిన స్తంభాలు సరిచేసి, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఏడు పదుల వయస్సులోనూ వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటిస్తూ.. ప్రజలకు సహాయ సహకారాలు అందించడాన్ని స్ఫూర్తిగా తీసేకుని, పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీఓ రమాకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

వరద బాధితులకు ఆహార పదార్థాలు

మాచర్ల రూరల్: వరద ప్రభావిత బాధితులను ఆదుకునేందుకు తమవంతుగా చేయూత అందించిన న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల, రామకృష్ణ సేవా సమితి, వ్యాపారుల సంఘాల సేవా గుణం అమూల్యమైనదని తహసీల్దార్ ఎండీ జియా ఉల్ హుక్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం 5,400 వాటర్ బాటిళ్లు, 3,500ల బిస్కెట్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలను లారీలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి అందించిన సహకారంతో మాచర్ల నుంచి భారీగా బాధితులకు అవసరమైన సరుకులను పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, మస్తాన్‌వలి, వీఆర్ఓలు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, రవి, భాస్కర్, న్యూటన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ జగదీష్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు ముత్యాల పాపిరెడ్డి తదితరులున్నారు.


ఆహార పదార్థాల లారీని ప్రారంభిస్తున్న తహసీల్దారు

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం


ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు


కురుస్తున్న వర్షం

మాచర్ల: గురువారం సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు పట్టణంలో గంట సేపు ఆగకుండా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాల్వలు పొంగి పొర్లాయి. అంబేడ్కర్ సెంటర్, ఆర్ అండ్ బీ కార్యాలయం, బస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్డు, కొమ్మళ్ళ కాలువ, 13వ వార్డు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కొద్ది సేపు వర్షపు ప్రభావం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేశారు.